19న హెచ్‌సీయూలో గోల్డెన్ జూబ్లీ లెక్చర్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ గోల్డెన్ జూబ్లీ విశిష్ట ఉపన్యాస కార్యక్రమాన్ని స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీ ఉదయం 11.30 గంటలకు సీవీ రామన్ ఆడిటోరియంలో నిర్వహిస్తారు. ఇందులో 'హ్యూమన్ క్యాపిటల్ ఇన్ ఇండియా: లెన్సెస్ ఓల్డ్ అండ్ న్యూ' అనే అంశంపై ఢిల్లీలోని ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్‌లో ఎకనామిక్స్ అండ్ ప్లానింగ్ యూనిట్ ప్రొఫెసర్ డాక్టర్ అభిరూప్‌ముఖోపాధ్యాయ ఉపన్యసిస్తారు.

యూటర్న్‌.. స్పెషల్ డ్రైవ్



వాహనదారులకు కౌన్సిలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ సీఐ ప్రశాంత్

మియాపూర్: ప్రధాన రహదారుల్లో యూటర్న్‌ వద్ద వాహనదారులు అడ్డదారిలో వెళ్లడం ప్రమాదకరమని మియాపూర్ ట్రాఫిక్ సీఐ ప్రశాంత్ అన్నారు. మియాపూర్‌లోని మెట్రోస్టేషన్ సమీపంలో యూటర్న్‌ వద్ద శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ యూటర్న్‌ వద్ద అడ్డదారిలో వచ్చిన 26 మంది ద్విచక్ర వాహనదారులు, నలుగురు ఆటోడ్రైవర్లపై కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేశారు. వాహనదారులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు మల్లేష్, సుభాష్, ట్రాఫిక్ సిబ్బంది ఉన్నారు.

ఐటీ రోడ్లు.. అవస్థలు

గుంతలు.. బురదమయం.. ఇబ్బందిపడుతున్న ప్రజలు



చందానాయక్ తండాలో రోడ్డుపై పారుతున్న మురుగు





అయ్యప్పసొసైటీలో రోడ్డు పక్కన చెత్త, భవన నిర్మాణ వ్యర్థాలు





రోడ్డుపై మురుగు, వ్యర్థాలు



ఐటీ ప్రాంతంగా పేరొందిన మాదాపూర్ పరిసర ప్రాంతాలలో రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. మాదాపూర్‌లోని సాయినగర్, అయ్యప్పసొసైటీ, చందానాయక్ తండా తదితర ప్రాంతాలలో కొద్దిపాటి వర్షం పడిందంటే చాలు రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. దీంతో రాకపోకలకు వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ భవన నిర్మాణ వ్యర్థాలను పడేయడంతో రోడ్లు ఇరుకుగా మారాయి. అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – మాదాపూర్

20న టీహబ్‌లో ప్రత్యేక సమావేశం

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీ హబ్‌లో ఈనెల 20వ తేదీ 3.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక చర్చా కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సౌత్ఏషియన్ విమెన్ ఇన్ టెక్ (ఎస్‌ఏడబ్ల్యూఐటీ), టీహబ్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తాయి. ఈ కార్యక్రమంలో 'ప్రాక్టికల్ ఇన్‌సైట్స్ ఇన్‌టూ డిప్లాయింగ్ జనరేటివ్ ఏఐ మోడల్స్' అనే అంశంపై జరిగే సమావేశంలో తెలంగాణ సీఐఐ ఐడబ్ల్యూఎన్ చైర్‌పర్సన్ విద్యారెడ్డి, టీహబ్ సీఈఓ శ్రీనివాసరావు, ఫిక్కీ ఎఫ్ఎల్ఓ చైర్‌పర్సన్ ప్రియా గజ్దార్, యూఎస్ కాన్సులేట్ పబ్లిక్ ఎఫైర్స్ ఆఫీసర్ అలెగ్జాండర్ మెక్లరాన్, వీహబ్ సీఈఓ సీత పాల్గొంటారు.

గోపన్‌పల్లితండా సమస్యలు పరిష్కరిస్తా

కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి



తండాలో సమస్యలు పరిశీలిస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: గోపన్‌పల్లితండాలో నెలకొన్న సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం తండాలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తండాలో అసంపూర్తిగా మిగిలిపోయిన యూజీడీ పైప్‌లైన్ పనులను, రోడ్లను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. అంతకు ముందు స్థానికులు మంచినీటి సౌకర్యం, పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరిగేలా చూడాలని కార్పొరేటర్‌ను కోరారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సర్కిల్ ఈఈ దుర్గాప్రసాద్, డీఈ విశాలాక్షి, ఏఈ రమేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్, సీనియర్ నాయకులు శేఖర్, రమేష్, రాజు, నర్సింహ, సురేష్, శంకర్ పాల్గొన్నారు.

బక్షికుంట చెరువు పునరుద్ధరణ ఓ మైలురాయి



బక్షికుంట చెరువు పునరుద్ధరణ పనులు పూర్తైన నేపథ్యంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, ఫెనోమ్ పిపుల్ ఐటీ కంపెనీ ప్రతినిధులు, బైరెడ్డి ఫౌండేషన్ ప్రతినిధులు

- పర్యావరణ సుస్థిరత్వంలో ఫెనోమ్ కొత్త ప్రమాణాలను నెలకొల్పింది
- ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ

హఫీజ్‌పేట్: చందానగర్ డివిజన్ పరిధిలోని బక్షికుంట చెరువు పునరుద్ధరణ మైలురాయిగా నిలిచిందని, ఫెనోమ్ పర్యావరణ సుస్థిరత్వంలో కొత్త ప్రమాణాలను నెలకొల్పిందని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ అన్నారు. శనివారం బక్షికుంట చెరువు పునరుద్ధరణ పనులు పూర్తయిన నేపథ్యంలో లేక్స్ కమిషనర్ శివకుమార్ నాయుడు కిల్లు, ఫెనోమ్ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ మహే బైరెడ్డి, ఫెనోమ్ సీఓఓ హరి బైరెడ్డి, కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి, లేక్ మ్యాన్ ఆఫ్ ఇండియా ఆనంద్ మల్లిగవాడ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బక్షికుంట చెరువు ప్రాజెక్టు కీలకమైన సహజ వనరులను పునరుజ్జీవింపజేయడమే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా భవిష్యత్తులో సుస్థిర అభివృద్ధికి నమూనా అవుతుందన్నారు. చెరువులను కాపాడడంతో పాటు సుందరీకరణలో భాగస్వామ్యం అవసరమన్నారు. బైరెడ్డి ఫౌండేషన్ సంస్థ మరిన్ని చెరువులను పునరుద్ధరించాలన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో 180 చెరువులు ఉండగా శేరిలింగంపల్లిలో 70 చెరువులు ఉన్నాయన్నారు. 40 చెరువులు అభివృద్ధి చేయాలని నిర్ణయించామన్నారు. అనంతరం బైరెడ్డి ఫౌండేషన్ సంస్థ, ఫెనోమ్ కేర్ ప్రతినిధులు మాట్లాడుతూ పర్యావరణ రక్షణలో భాగస్వాములవడం గర్వంగా ఉందన్నారు. బక్షికుంట చెరువు చుట్టుపక్కల లక్ష మంది జనాభాకు ముఖ్యమైన నీటి వనరుగా ఉందన్నారు. చెరువు కట్టపై చిన్నారులకు ఆటస్థలం కూడా ఏర్పాటు చేశామన్నారు.

'రాఖీ సందడి' షురూ..







అన్నాచెల్లెలు...అక్కాతమ్ముడి అనుబంధాలకు ప్రతీక 'రాఖీపౌర్ణమి'. రాఖీ పండగను పురస్కరించుకుని లింగంపల్లి, తారానగర్ మార్కెట్‌లో స్టాళ్లను ఏర్పాటు చేసి రాఖీల విక్రయాలు ఆరంభించారు. ఒక్కో రాఖీ రూ.10 నుంచి రూ.500 ధర పలుకుతోంది. అలాగే పూలు, పండ్లు, స్వీట్లు, గిఫ్ట్‌లను కొనుగోలు చేస్తున్నారు. కాగా 3,720 రకాల రాఖీలు అందుబాటులో ఉన్నాయని స్టాళ్ల నిర్వాహకులు తెలిపారు. సిల్వర్, సీజెడ్ స్టోన్లతో తయారు చేసిన రాఖీలు ఉన్నాయని తెలిపారు. – శేరిలింగంపల్లి

రక్షాబంధన్ వేడుక



సీఐ పాలవెల్లికి రాఖీ కడుతున్న విద్యార్థులు

చందానగర్: రక్షాబంధన్‌ను పురస్కరించుకొని శనివారం చందానగర్ పోలీస్‌స్టేషన్‌లో త్రివేణి పాఠశాల విద్యార్థులు సీఐ పాలవెల్లికి రాఖీ కట్టారు. అలాగే ఎస్‌ఐలకు, సిబ్బందికి రాఖీలు కట్టారు. అనంతరం సీఐ పాలవెల్లి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెస్టారెంట్‌ను ప్రారంభించిన ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి



బోనాలు రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి తదితరులు

గచ్చిబౌలి: నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందించాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సూచించారు. శనివారం గచ్చిబౌలిలో బోనాలు మల్టీ కజిన్ రెస్టారెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఆంధ్ర, తెలంగాణ, రాయలసీమ, మొఘలాయి, పంజాబీ, చైనీస్ రుచులు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

బోనాల ఏర్పాట్లు పరిశీలన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని శ్రీనివాస్‌నగర్ కాలనీ ఐదుగుళ్ల పోచమ్మ తల్లి ఆలయంలో ఆదివారం జరుగనున్న శ్రావణమాస బోనాల పండుగ ఏర్పాట్లను శనివారం కార్పొరేటర్ పుష్పనగేష్ పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లను చేయడం జరిగిందన్నారు.

జీఐఎస్ ఇంటింటి సర్వే పరిశీలన



గౌతమీనగర్‌లో సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

హఫీజ్‌పేట్: జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం (జీఐఎస్) ఇంటి ఆస్తుల సర్వేను శనివారం చందానగర్ డివిజన్ పరిధిలోని గౌతమీనగర్‌లో జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీష్, చందానగర్ సర్కిల్ 21 ఇంచార్జి ఉపకమిషనర్ రజనీకాంత్‌రెడ్డి, కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి, సర్కిల్ 21 ఏఎంసీ కృష్ణ, జీఐఎస్ సర్వే అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె స్థానికుల నుంచి సర్వే విధానంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ సర్వే పట్టణ నిర్వహణ మెరుగుపర్చడానికి ఉపయోగపడుతుందన్నారు. ఈ సర్వేకు ప్రజలు సహకరించాలని సర్వేయర్లు అడిగిన పత్రాలను అందజేయాలని కోరారు. ఇంటి ఆస్తి పన్ను పత్రం, కరెంటు బిల్లు, మంచినీటి బిల్లు ఇవ్వాలన్నారు. ఈ పరిశీలనలో జీహెచ్ఎంసీ అధికారులు, చందానగర్ ఏఎంసీ విజయ్, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఐటీ మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన ఎమ్మెల్యే గాంధీ

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని వినతి



గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయించాలని రంగారెడ్డి జిల్లా ఇంచార్జ్, ఐటీ మంత్రి శ్రీధర్ బాబును ఎమ్మెల్యే గాంధీ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. చెరువులు, పార్కుల అభివృద్ధి, డ్రైనేజీ, సీసీరోడ్ల అభివృద్ధికి సహకరించాలని కోరారు. అధికారుల మధ్య సమన్వయలోపంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను పరిష్కరిస్తానని, అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తామని మంత్రి హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, రఘునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు





అన్నమయ్యపురంలో ఐశ్వర్యభారతి సంకీర్తనాలాపన

మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా శనివారం పావని శ్రీలత శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన అలరించింది. ఇందులో ఆనంద నర్తన, మీనాక్షి పంచరత్న, ఆలోకయే, అంశాలను కళాకారులు సమన్వి, చైత్ర, కీర్తి, శ్రీయ వర్దిని, పూర్వి, సుధీక్ష, షాలిని, అలేఖ్య, తనుశ్రీ,, హరిత ప్రదర్శించారు. మహంకాళీ సూర్యనారాయణ శర్మ శిష్యబృందం వాతాపి గణపతి, భామా కలాపం, ఒకపరి ఒకపరి, మాధవ, కేశవ, గోవిందా గోవిందా కీర్తనలకు లిఖిత, గీతికా, వర్షిత, భవ్య, శ్రీయ, కీర్తనలు నృత్య ప్రదర్శన ఇచ్చారు.

సంకీర్తనార్చన

మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శనివారం ఐశ్వర్య భారతీ సంకీర్తనార్చన చేశారు. మత్స్యాకూర్మ వరాహ, తిరుమలగిరిరాయ, తందనానా, సతులారా చూడరే తదితర అన్నమాచార్య కీర్తనలను ఆలపించి అలరించారు. వయోలిన్ విక్రమ్ తిరుపతి, మృదంగం పి.విద్యాసాగర్ వాయిద్య సహకారాన్ని అందించారు. అనంతరం డాక్టర్ శోభారాజు కళాకారులను సత్కరించారు.

కనీస వేతనాల కోసం పోరాడాలి

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు

పటాన్‌చెరు టౌన్: కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణం అని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ధ్వజమెత్తారు. పటాన్‌చెరు పారిశ్రామికవాడలో గల శాండ్విక్ పరిశ్రమలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల వేతనాల పెంపు కోసం కృషి చేసిన సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములును శనివారం అభినందించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ... భవిష్యత్తులో కనీస వేతనాల కోసం ఐక్య ఉద్యమాలు చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శాండ్విక్ యూనియన్ నాయకులు పి.పాండురంగారెడ్డి, వీరారావు, సదాశివ రెడ్డి, నర్సింహులు, గంగాధర్, విష్ణు, కార్మికులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

పటాన్‌చెరు టౌన్: విద్యార్థులు, మహిళలు హెల్ప్‌లైన్ నంబర్ల గురించి తెలుసుకోవాలని మెడికల్ ఆఫీసర్ కోమలి అన్నారు. శనివారం జెడ్పీహెచ్ఎస్ మంగంపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు శిశు సంక్షేమ శాఖ మహిళా సాధికారిక కేంద్రం ఆధ్వర్యంలో మిషన్ శక్తి కింద వంద రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు బాలల హక్కులు, షీ టీమ్, హెల్ప్‌లైన్ నంబర్లు (1098, 100, 181,112, 1930) గురించి అవగాహన కల్పించారు.

పని ప్రదేశంలో శుభ్రత పాటించాలి



రామచంద్రాపురం(పటాన్‌చెరు): పని చేసే ప్రదేశంలో ప్రతి ఒక్కరు శుభ్రత పాటించాలని భెల్ ఈడి కే.బి.రాజా సూచించారు. రామచంద్రాపురం బీహెచ్ఈఎల్ యూనిట్‌లో శనివారం స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమంలో భాగంగా ఆయన అధికారులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 31వ తేదీ వరకు పరిశ్రమలో స్వచ్ఛతా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు, వ్యర్థాల నిర్వహణపై అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు.

'చట్టాల అమలులో చిత్తశుద్ధి లేదు'

మియాపూర్: కోల్‌కతా ఘటనలో నిందితులను ఉరి తీయాలని ఎఐఎఫ్‌డీడబ్ల్యూ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి అంగడి పుష్ప డిమాండ్ చేశారు. వైద్య విద్యార్థిని హత్యోదంతంపై దేశం యావత్తూ నివ్వెరపోయిందన్నారు. స్వాతంత్ర్య భారతదేశంలో మహిళలకు రక్షణ కరువైందని పాలకవర్గాలు సిగ్గుపడాలన్నారు. మహిళల రక్షణకోసం అనేక చట్టాలు ఉన్నా అమలు చేయడంలో చిత్తశుద్ధి లేదని ఈ క్రమంలోనే మహిళలపై అఘాయిత్యాలు పెరుగుతున్నాయన్నారు. మహిళలపై దారుణాలకు పాల్పడే వారికి ఉరి శిక్ష అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా సంఘం రాష్ట్ర నాయకురాలు తాండ్ర కళావతి, శివాణి, లలిత, అరుణ, లక్ష్మీ, గీత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

పార్ట్ టైం జాబ్ అంటూ..

పటాన్‌చెరు టౌన్: పార్ట్‌టైం జాబ్ అంటూ ఫోన్‌కు వచ్చిన వాట్సాప్ మెసేజ్‌కు స్పందించిన ఓ గృహిణి రూ.లక్ష 80 వేలు పోగొట్టుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అమీన్‌పూర్ మండల పరిధిలోని పటేల్‌గూడకు చెందిన మహిళకు పార్ట్‌టైం జాబ్ అంటూ తన వాట్సాప్‌కు ఆగస్టు 13 తేదీ మెసేజ్ వచ్చింది. ఆమె తన వివరాలను నమోదు చేయడంతో సైట్ నిర్వాహకులు ఒక వాలెట్ క్రియేట్ చేసి ఇచ్చారు. దీంతో ఆమె ముందుగా రూ.2 వేలు చెల్లించి ఇచ్చిన టాస్కులు చేసింది. తాను పెట్టిన నగదును సైబర్ నేరగాళ్లు తనకిచ్చిన వాలెట్‌లో చూపిస్తూ వచ్చారు.ఈ క్రమంలో మొత్తం రూ. ఒక లక్ష 80 వేలు చెల్లించింది. వాలెట్ లో నగదుతో పాటు కమిషన్ నగదు చూపిస్తూ వచ్చారు. చివరికి పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం అమీన్‌పూర్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేయగా ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వర్షం.. రోడ్లు జలమయం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ,అమీన్‌పూర్ పరిధిలో శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. పటాన్‌చెరు మండలం ముత్తంగి ఓఆర్ఆర్ జాతీయ రహదారి వద్ద పెద్ద ఎత్తున వర్షపు నీరు నిలవడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.అదేవిధంగా ఇస్నాపూర్ నుండి పాశమైలారం వెళ్లే దారిలో జాతీయ రహదారిపై నీరు నిలవడంతో పారిశ్రామికవాడ నుంచి వచ్చే కార్మికులు ఇబ్బంది పడ్డారు. అదేవిధంగా బీరంగూడలోని భ్రమరాంబిక నగర్ లో రోడ్లు జలమయం అయ్యాయి.

కోల్‌కతా ఘటనపై నిరసనలు,ర్యాలీలు



నానక్‌రాంగూడ స్టార్ ఆస్పత్రిలో నిరసన తెలుపుతున్న వైద్య బృందం

గచ్చిబౌలి: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటనపై నిరసనలు వెల్లువెత్తాయి. ఐటీ కారిడార్‌లోని పలు ప్రైవేటు ఆస్పత్రుల ఆధ్వర్యంలో ఓపీ సేవలు నిలిపివేసి శనివారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. డాక్టర్లకు న్యాయం చేయాలి, భద్రత కల్పించాలి, నిందితులను కఠినంగా శిక్షించాలంటూ ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా.నవీన్‌చంద్, డాక్టర్లు శైలజ, అభినయ, వినోద్, చాణక్యకిషోర్, జగన్‌మోహన్‌రెడ్డి, శివ, యుగంధర్ రెడ్డి, దీపక్, శర్మ పాల్గొన్నారు.

కేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో..

గచ్చిబౌలిలోని కేర్ ఆస్పత్రి వైద్య బృందం నిరసన ర్యాలీ నిర్వహించారు. వైద్యులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

మాదాపూర్‌లో..

మాదాపూర్: కోల్‌కతా ఘటనకు నిరసనగా దేశవ్యాప్తంగా ఉన్న అన్ని మెడికవర్ ఆసుపత్రులలో ఓపి సేవలను బహిష్కరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శరత్‌రెడ్డి, డాక్టర్ హరికృష్ణ పాల్గొన్నారు. యశోద ఆస్పత్రిలో.. నగరంలోని అన్ని యశోద ఆస్పత్రుల్లో ఓపి సేవలను నిలిపివేశారు. వైద్య సిబ్బంది నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ డా.లింగయ్య ,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పరమిత మాతృ ఆస్పత్రి ఆధ్వర్యంలో..

మదీనాగూడలోని పరమితమాతృ ఆస్పత్రి వైద్య బృందం ప్లకార్డులు చేత పట్టుకొని నిరసన తెలిపారు.



మాదాపూర్‌లో మెడికవర్ ఆస్పత్రి వైద్యుల ర్యాలీ



మదీనాగూడలో పరమిత మాతృ ఆస్పత్రి వైద్య బృందం నిరసన తెలుపుతున్న దృశ్యం

రైతు సంక్షేమానికి ప్రథమ ప్రాధాన్యత

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



షాపింగ్ కాంప్లెక్స్ పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే

పటాన్‌చెరు: రైతు ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామంలో శనివారం 60 లక్షల రూపాయల నిధులతో నిర్మించ తలపెట్టిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనం మరియు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దేశంలోనే మొట్ట మొదటిసారిగా రైతులందరికీ రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందన్నారు. త్వరలోనే రైతు భరోసా నిధులు సైతం విడుదల కాబోతున్నాయని తెలిపారు. నియోజకవర్గంలో నూతన గోదాములను నిర్మించబోతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పాండు, మాజీ సర్పంచ్ సుధీర్‌రెడ్డి, సీనియర్ నాయకులు దశరథరెడ్డి, వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు ప్రసాద్‌రెడ్డి, రాజు, నరసింహారెడ్డి ,వెంకన్న, యాదయ్య, సొసైటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.